# 14. బెండకాయ ముదిరితే. . .

ఎన్నిసార్లు పరాజయం పాలయినా నిరాశచెందకుండా భారతదేశంపై మళ్ళీ దండెత్తి వచ్చే ఘోరీ మహమ్మద్‌లా చెట్టుదగ్గరి కొచ్చాడు సోమయ్య—ధోతీ చిందులను మలిచి బొడ్లోచెక్కి చెట్టెక్కాడు —చెట్టుపై నున్న శవాన్ని భుజంపై వేసుకొని దిగి శ్మశానందిక్కు వడివడిగా నడుస్తున్నాడు—అతన్ని మాట్లాడించాలని శవంలోని భేతాళుడు

"ఓ మానవుడా! నిన్ను చూస్తుంటే ఆడపిల్లల తండ్రిలా కనబడటంలేదు—ఆర్థిక ఇబ్బందులున్నవాడిలా కూడా అనిపించడంలేదు — మరి నువ్వేంకోరి నన్ను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నావో నాకర్థం కావడంలేదు—" అన్నాడు....

"ఎవరితో చెప్పుకున్నా మానంపోయేలావుంది— ఆడపిల్ల పెళ్ళి కొరకు కాళ్ళరిగేట్టు తిరుగుతూకష్టబడినా అర్థముంది — కాని, నా సుపుత్రుడి పెళ్ళి నాకో సమస్యయికూర్చుంది —వాడెన్ని చెడుసావాసాలు చేసినా, చెడుతిరుగుళ్ళు తిరిగినా, ఎన్ని దుర్లక్షణాలు కలిగివున్నా వాన్ని పెళ్ళి చేయకుంటే నా వంశం నిలిచేదెట్ల — ? వాని సంగతి తెలిసినవాళ్ళెవరూ పిల్లనివ్వడానికి ముందుకురావడంలేదు.... ఇస్తామన్న ఒకటి రెండు సంబంధాలు వీడి బాపతువయి దొందూ దొందే అన్నట్టున్నాయి- పెళ్ళైతేనన్నా వీడు బాగుపడతాడేమోనన్న ఆశతో తిరుగుతున్నాను-" తనలోతానే గొణుక్కుని వేగంగా అడుగులేస్తున్నాడు....

మౌనంగా నడుస్తున్న సోమయ్యనుద్దేశించి భేతాళుడు "నువ్వెందుకు నన్నుస్వాధీనం చేసుకోవాలనుకున్నా నా పరీక్షల్లో నెగ్గితే తప్పకుండా

నీకు స్వాధీనమవుతాను—నమ్మినవాళ్ళకే వెన్నుపోటు పొడిచే మనుషుల్లా చేయను నేను—నీకు బరువు తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను—అని చెప్పసాగాడు....

రాజ్ మోహన్ తండ్రి మధ్యతరగతిరి చెందినవాడు—వ్యవసాయం చేస్తూ జీవిస్తుంటాడు........తాను కష్టపడుతున్నా కొడుకును సుఖంగానే పెంచాడు—తనకు శక్తి కిమించిందేఅయినా ఎమ్.ఏ వరకు చదివించాడు—అయి ఎమ్.ఏ చదివినా రాజ్ మోహన్ తన పూర్వస్థితిని మరిచిపోయాడు— తాను ఆకాశంనుండి ఊడిపడ్డ అపూర్వమైన వాడిగా భావించసాగాడు ...శక్తి కిమించిన కోరిన కొడుకు కోర్కెలను చదువుకున్న కొడుకును బాధపెట్టొద్దని తీర్చాడాతని తండ్రి ... చదువయిపోయిం తర్వాత ఆతనికి పెళ్ళిసంబంధాలు రాసాగాయి...ఒకమ్మాయిని చూచి ఎత్తుసరిగా లేదని, మరో అమ్మాయిని ఎక్కువెత్తుందని, ఇంకో అమ్మాయిని చూచి నలుపుందని, వేరే అమ్మాయినిచూచి రంగెక్కువై పాలిపోయినట్టుందని రకరకాల వంకలు పెట్టసాగాడు ... ఒకమ్మాయి నచ్చినా ఎమ్మేచేసిన తనకు వాళ్ళిచ్చే బోడిరపైవేల కట్నం నచ్చలేదని నిరాకరించాడు ...

కొద్దిరోజుల్లో అతనికుద్యోగమయింది — ఉద్యోగమైన తర్వాత సంబంధాలు మరీ ఎక్కువ రాసాగాయి...తన విలువ పెరిగిందని గర్వపడ్డాడు రాజ్ మోహన్—గాలిలో తేలిపోతున్నాడు— కాలెరెగరేస్తున్నాడు—పూర్వం కథల్లో రాజకుమారుడు ఏడునిమ్మకాయలెత్తు అమ్మాయి దొరికితేనే చేసుకుంటానన్నట్టుగా రాజ్ మోహన్ అందం, చదువు అన్నీవుండి తాను కోరినంత భారీకట్నంతెచ్చే అమ్మాయి దొరికితేనే పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నాడుఓకొద్దో గొప్పో ఆస్థి, ఎమ్మే చదువు ఉద్యోగం వున్న తనలాంటి వరుడు దొరకాలంటే మాటలా అని తననుతానే సమ

రించుకున్నాడు-వచ్చిన సంబంధాలన్నిట్ని ఏదో వంకపెట్టి ముఖ్యంగా శక్తికిమించిన కట్నం వంకతో వద్దంటున్నాడు-కట్నం డబ్బుతోపాటు స్కూటర్, టి.వి. ఫ్రిజ్‌లాంటి లాంచనాలనూ చేర్చాడు ... ఐదారేళ్ళయినా అతనికే సంబంధమూ కుదరలేదు.... ఈలోగా అతనికి ప్రమోషనొచ్చింది—జీతం, హోదా పెరిగాయి...తన విలువ మరింత పెరిగిందని అన్నీ పెంచేసాడు రాజ్‌మోహన్—కొన్ని రోజులు సంబంధాలొచ్చాయి కాని ఆటు తర్వాత రావడమే ఆగిపోయాయి— రెండేళ్ళయినా ఒక్క సంబంధమూ రావడంలేదు—గతుక్కుమన్నాడు రాజ్‌మోహన్—కట్నమనీ రేటు తగ్గించాడు—అయినా ఫలితం శూన్యం...అతని వయసు ముప్పైదాటి రెండేళ్ళయింది-ఏడు నిమ్మకాయలెత్తు అమ్మాయికాని డెబ్బై కిలోలున్న అమ్మాయైనా సరేనని తానే వెదకడం ప్రారంభించాడు...కాని అతనికి పిల్లనివ్వడానికెవ్వరూ ముందుకు రావడంలేదు...

చెప్పడం ఆపాడు భేతాళుడు....

"మొదట ఎంతోమంది పిల్లనివ్వడాని కొచ్చి తర్వాతెందుకు రావడమే మానుకున్నారు—? ప్రమోషన్ కూడా పొందిన రాజ్‌మోహన్ రేటు తగ్గించినా-అమ్మాయెందుకు దొరకడం లేదు-? ఆ తర్వాతయినా అతనికి పెళ్ళయ్యుంటుందా—?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పక పోయావో ఘోరాతి ఘోరంగా శపిస్తాను జాగ్రత్త—" అన్నాడు భేతాళుడు—

"ఆడపిల్లల పెళ్ళిళ్ళే సమస్యగావున్న ఈ సమాజంలో చదువు, (సంస్కారం సంగతి దేవుడెరుగు) ఉద్యోగముంన్న రాజ్‌మోహన్ దగ్గరకు పిల్లనిస్తామని ఆడపిల్లల తండ్రులు రావడం సహజం — అయితే రాజ్‌మోహన్ అందమని, చదువని, కట్నమని, లాంచనాలని ఏదో

వంకపెట్టి అన్ని సంబంధాలను నిరాకరించేసరికి వాళ్ళకు విసుగుపుట్టి రావడం మానుకున్నారు—మళ్ళీ ఆ పెళ్ళి కులంలో జరిగేది కాబట్టి రాజ్‌మోహన్‌ను గూర్చి ఒకరితో ఒకరు చెప్పుకోవడంవల్ల అతని గూర్చి అనుకోకుండానే వ్యతిరేక ప్రచారం జరిగుంటుంది—అందువల్ల రావాలనుకున్నా వాళ్ళూ మానుకొనుండారు—

సంబంధాలు రావడం ఆగిపోయేసరికి తనను తాను చూచుకున్న రాజ్‌మోహన్‌కు తన పరిస్థితి అర్థమయ్యుంటుంది—మరోదిక్కు పెరుగుతున్న వయసు — వయసెక్కువైతే ఈడు జోడుగల సంబంధాలు కుదరడమూ మధ్యతరగతి కుటుంబాల్లో కొంత కష్టమే - అంతేకాకుండా చదువు, ఉద్యోగం రెండూవుండి ఇన్నేళ్ళెందుకు పెళ్ళిచేసుకోలేదని, అతనిలో ఏదోలోపముందని భావించే అవకాశమూ లేకపోలేదు ..అందువల్ల రాజ్‌మోహన్ సంబంధాలు వెదికినా బంధువుల్లో, కులంలో పెళ్ళిళ్ళను నిరాకరించే వాడిగా ముద్రపడినా రాజ్‌మోహన్‌కు పిల్లనివ్వటాకెవ్వరూ ముందుకు వచ్చి ఉండరు —

ఇక మీ మూడోప్రశ్నకు జవాబు .... ఈ సమాజంలో దొంగకు, వ్యభిచారికి మరెన్నో దుర్గుణాలున్న వాడికైనా పిల్లనివ్వడానికి ముందుకొచ్చే తల్లిదండ్రులున్నారు—అలాంటప్పుడు తనపై వ్యతిరేక ప్రచారం జరిగినా ఉద్యోగం వున్న రాజ్‌మోహన్‌కు కొంత ఆలస్యంగానైనా ఎవరో ఒకరు అమ్మాయి నిచ్చివుంటారు...

తానాశించిన సమాధానాలు సోమయ్య నుండి రాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు.

[జీవగడ్డ ఆగష్టు 1986]